క్లుప్తంగా

ఘనంగా రాజమ్మ తల్లి పండుగ



రాజమ్మ తల్లిని దర్శించికుంటున్న నాయకులు

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేటలో రాజమ్మ తల్లి పండుగను ఆదివారం ఘనంగా చేపట్టారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో అభిషేకాలు చేశారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

145 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 145 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వారిలో 55 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు, కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కొట్టాం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శిబిరంలో సేవలందించారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

జామి: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని లోక్‌సత్తా రాష్ట్రపార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బోనంగి హైస్కూల్ హెచ్‌ఎం నర్సింగరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అట్టాడ బీఎన్‌ఆర్ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. జామి హైస్కూల్‌లో 1980లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కావని, కానీ ప్రస్తుతం విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం సమకూరుస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరు ఏర్పాటు శంకుస్థాపన చేస్తున్న స్థానిక నాయకులు

వేపాడ: మండలంలో ఆతవ సచివాలయం పరిధి ఆకులసీతంపేట గ్రామంలో జలజీవన్ మిషన్ కింద తాగునీటి బోరు వేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్దలు కొబ్బరికాయ కొట్టి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ బోరు ద్వారా గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

నగదు ప్రోత్సాహకానికి ఎంపిక



అనూష

వేపాడ: స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.అనుష ప్రభుత్వం అందించే నగదు ప్రోత్సాహకానికి ఎంపికైందని ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో 968/1000 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం రూరల్(మెంటాడ): మరుపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6302229335 నంబరులో సంప్రదించాలని కోరారు.

పరుగులు తీస్తున్న అభివృద్ధి

- గ్రామాల్లో అందుబాటులోకి వస్తున్న మౌలిక వసతులు
- ప్రారంభానికి సిద్ధంగా గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు



చీపురుపల్లి: గొల్లలములగాంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం, ఆర్‌బీకే

చీపురుపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తుండడంతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. గొల్లలములగాం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో చేపట్టిన రైతుభరోసా కేంద్రం నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. త్వరలోనే వాటిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వేపాడలో..

వేపాడ: మండలంలోని పలు పంచాయతీల పరిధిలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. బానాది, దబ్బిరాజుపేట, శింగరాయి, వల్లంపూడి, వావిలపాడు గ్రామాల్లో సచివాలయాలు, శింగరాయిలో ఆర్‌బీకే, దబ్బిరాజుపేట, వావిలపాడు, పాటూరులో వెల్‌నెస్ కేంద్రాల



వేపాడ: నిర్మాణం పూర్తయిన బానాది గ్రామ సచివాలయ భవనం

నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని త్వరలోనే ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు వీలుంటుందని ఆయా శాఖల సిబ్బంది అంటున్నారు.



మెరకముడిదాం: గొట్నంది నుంచి సిరిదేవిపురం గ్రామానికి ఇటీవల నిర్మించిన బీటీరోడ్డు

తొలగిన రహదారి కష్టాలు

మెరకముడిదాం: మండలంలోని సిరిదేవిపురం గ్రామస్తుల రహదారి కష్టాలు తొలగిపోయాయి. రాళ్లు, గోతులతో నిండివున్న ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడేవారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రోడ్డు నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏపీఆర్‌ఆర్‌పీ నుంచి రూ.123.80 లక్షలు నిధులు విడుదల చేయడంతో గరివిడి మండలం గొట్నంది గ్రామం నుంచి సిరిదేవిపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రహదారి అందుబాటులోకి రావడంతో ప్రయాణ కష్టాలు తొలగిపోయాయంటూ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల నుంచి గోధుమల పంపిణీ



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న సీఎస్‌డీటీ రామారావు

చీపురుపల్లి: రేషన్ లబ్ధిదారులకు చౌకధరల దుకాణాల ద్వారా గోధుమలు సరఫరా చేయనున్నట్లు సివిల్‌సప్లై డీటీ పిన్నింటి రామారావు తెలిపారు. ఈ మేరకు వంగపల్లిపేటలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ లబ్ధిదారులకు బియ్యం, పప్పు, పంచదారతో పాటు గోధుమలను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కిలో రూ.10లు చొప్పున ఒక్కో కార్డుకు మూడు కిలోలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులను వ్యాపారులకు విక్రయించినా, లబ్ధిదారల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసినా నేరంగా పరిగణించి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరిడ రాందాసు, వార్డు మెంబరు పోలీసు, మీసాల సీతారం, డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శృంగవరపుకోట: స్థానిక గాంధీ పార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడి బంగారునాయుడు ఆధ్వర్యంలో దివంగత ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీసెల్ చైర్మన్ చీమల అచ్చిబాబు, హెచ్.నానాజీ, కాంగ్రెస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తాం

- నేషనల్ హైవే డీఈ కేవీఎస్ నర్సింహారావు



ప్రభుత్వ స్థలంలో వేసిన మట్టిపోగులు

గజపతినగరం: మండల కేంద్రంలో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆటంకం కలిగించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు నేషనల్ హైవే డీఈ కేవీఎస్ నర్సింహారావు అన్నారు. గజపతినగరం శ్రీకృష్ణా విద్యాపీఠం స్కూల్ ఎదురుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వాహనాల పార్కింగ్ కోసం మట్టిని వేసి చదును చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే పనులు నిలిపివేయాలని వారిని ఆదేశించినట్లు చెప్పారు. పురిటిపెంట గ్రామ పంచాయతీ అధికారులు కూడా మట్టిని వేసిన వారిని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి పనులు చేపట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామంలో వెలసిన పైడితల్లమ్మ ఉత్సవాలను సోమవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఎస్.ఎస్.వర్మ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి దుర్గాలమ్మ పండగ

జామి: మండలంలోని అన్నంరాజుపేటలో గ్రామదేవత దుర్గాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు తొలేళ్ల ఉత్సవం, మంగళవారం పెద్ద పండగ జరుపుకోనున్నట్లు చెప్పారు. పండగలో భాగంగా పులివేషాలు, విశేష వేషధారణలు, సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన 19 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయాలపై ముందస్తు సమాచారం మేరకు పెదమానాపురం పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద మద్యం బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.శిరీష తెలిపారు.

23న వలంటీర్లకు సన్మానం

దత్తిరాజేరు: మండలంలోని చొదంతివలస, పాచలవలస గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 23న వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా సన్మానించనున్నట్లు చెప్పారు.

ఐఐటీ, నీట్ కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి

కొత్తవలస: సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల శిక్షణకు సంబంధించి ఆదివారం వియ్యంపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 68 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 57 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల మాదిరిగా ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గురుకులాల జిల్లా సమన్వయాధికారి బి.చంద్రావతి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తవలస, లక్కవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పి.శివప్రసాద్, కె.ధర్మకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీలకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 ఫీజు నిర్ణయించినట్లు తెలిపారు. కులధ్రువీకరణ పత్రం, 10వ తరగతి హాల్‌టికెట్, మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేసి ఒక కాపీని సంబంధిత కళాశాలలో అందజేయాల్సి ఉంటుందన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీరాం జూనియర్ కళాశాల, ఎస్‌డీఎస్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గరివిడిలోని రతన్ చంద్ నగర్‌లో ఆదివారం వైభవంగా జరిగింది. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుభోదకుమార్ రకేచ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో కళాశాల ఫౌండర్ దుర్గాప్రసాద్ షరాఫ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి మౌళి మాస్టార్‌ను సన్మానించారు. 50 ఏళ్ల ఘనచరిత్ర ఉన్న ఈ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని గుర్తుచేశారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు మజ్జి భాస్కరరావు, డా.ప్రసన్నలక్ష్మి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సేవా రత్నం



గొంప ఉమ

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన వలంటీర్ గొంప ఉమాకు వరుసగా రెండో ఏడాది సేవా రత్న అవార్డు వరించింది. వలంటీర్ల సేవలకు ప్రోత్సాహంగా ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందిస్తున్న విషయం విదితమే. సేవా మిత్ర కింద రూ.10వేలు, సేవా రత్న కింద రూ.20 వేలు, సేవా వజ్ర కింద రూ. 30వేలు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఉమ సేవలను గుర్తించిన అధికారులు ఆమెకు వరుసగా రెండో ఏడాది సేవా రత్న అవార్డుతో సత్కరించారు.

25న జిల్లాస్థాయి సంగిడిరాళ్ల పోటీలు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో బంగారమ్మతల్లి పండుగ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న ఉదయం 9 గంటల నుంచి జిల్లా స్థాయి సంగిడిరాళ్ల పోటీలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

తాగునీటి సమస్యకు.. శాశ్వత పరిష్కారం

- పట్టణంలో చురుగ్గా ఏఐఐబీ తాగునీటి పథకం పనులు
- రూ. 35 కోట్లతో తాగునీటి ట్యాంక్‌లు, గ్యాలరీల నిర్మాణం
- పట్టణవ్యాప్తంగా 4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు
- నగర పంచాయతీ ప్రజలకు మరింత పుష్కలంగా తాగునీరు



జరజాపుపేటలో నిర్మాణం పూర్తయిన వాటర్ గ్యాలరీ

నెల్లిమర్ల: పట్టణవాసులకు మరింత పుష్కలంగా తాగునీటిని అందించాలన్న ప్రభుత్వ ఆశయం మరి కొద్ది రోజుల్లోనే నెరవేరబోతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ద్వారా మంజూరైన తాగునీటి పథకం పనులు పట్టణంలో చురుగ్గా జరుగుతున్నాయి. రూ. 35 కోట్లతో స్థానిక చంపావతి నదిలో వాటర్ గ్యాలరీలు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు, వేర్వేరు ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. పథకాల నిర్మాణం పూర్తయితే పట్టణంలోని 20 వార్డులకు చెందిన 4,500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తారు. దీంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే గాకుండా నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన 30 వేల మంది ప్రజలకు మరింత పుష్కలంగా తాగునీరు అందుతుందనడంలో సందేహం లేదు. వివరాల్లోకి వెళితే..

రూ. 35 కోట్ల ఏఐఐబీ నిధులతో..

నెల్లిమర్ల నగర పంచాయతీలో తాగునీటి సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడానికి ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో పట్టణంలోని 20 వార్డులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పట్టణంలో చేపడుతున్న పనులివే

పట్టణంలో ప్రస్తుతం ఏఐఐబీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొండపేట, పద్మశాలివీధి, జరజాపుపేట వద్ద చంపావతి నదిలో వాటర్ గ్యాలరీల నిర్మాణం చురుగ్గా చేపడుతున్నారు. జరజాపుపేట గ్యాలరీ నిర్మాణం పూర్తయ్యింది. ఇన్‌ఫిల్టరేషన్ బావి నిర్మాణం దాదాపు 40 శాతం పూర్తయ్యింది. మిగిలిన రెండు ప్రాంతాల్లోనూ గ్యాలరీల, ఇన్‌ఫిల్టరేషన్ బావుల నిర్మాణం ఇటీవల ప్రారంభమైంది. వీటి నిర్మాణం ప్రస్తుతం చురుగ్గా జరుగుతోంది. వేసవిలో సైతం నీరు నిల్వ ఉండేలా గ్యాలరీల నిర్మాణం చేపడుతున్నారు. అలాగే పట్టణంలోని మూడు ప్రాంతాల్లో ట్యాంకులను నిర్మిస్తున్నారు. జరజాపుపేటలో 500 కేఎల్, చంద్రబాబు కాలనీలో 300 కేఎల్, కొండపేటలో 200 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకుల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది.

4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

పట్టణంలోని 4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. 20 వార్డుల్లో ఇప్పటికే ఉన్న కుళాయిలతో పాటు అదనంగా వీటిని ఏర్పాటు చేస్తారు. పథకం ఫేజ్–2లో భాగంగా పట్టణంలో తాగునీటి సరఫరాకు అవసరమైన కొత్త పైప్‌లైన్ వేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రతి ఇంటికీ ఇకపై తాగునీరు పుష్కలంగా అందుతుందని చెప్పడంలో సందేహం లేదు. మండు వేసవిలో సైతం ప్రతిరోజూ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి అవకాశముంటుంది.

టీడీపీ హయాంలో నిధులున్నా జరగని పనులు

నగరపంచాయతీలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏఐఐబీ నిధులు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. అయితే నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆ ప్రభుత్వం పనులు చేపట్టలేదు. దిగిపోయే ముందు 2019లో హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయినా పనులు ప్రారంభించలేదు.



కొండపేటలో వాటర్ గ్యాలరీ నిర్మాణ పనులు

మాజీ మంత్రి అశోక్‌వి చీప్ ట్రిక్స్

- మహనీయుల విగ్రహాలతో రాజకీయం చేయడం సిగ్గు చేటు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రచారం కోసమే కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చీప్ ట్రిక్స్ ఉపయోగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పూలే విగ్రహం వద్ద కావాలని తాము తాళం వేసినట్లు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆ మహానుభావుడు విగ్రహానికి పూలమాల వేసేందుకు అశోక్ గజపతిరాజు, తదితరులు వెళ్తూ.. మార్గమధ్యంలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి దండ వేసేందుకు ఆగారని.. అక్కడ ప్రహరీకి తాళం వేసి ఉండడంతో గేటుకు దండ తగిలించి ఆయన వెళ్లిపోయినట్లు తాను పత్రికల్లో చదివానన్నారు. అయితే తామేదో కావాలని తాళాలు వేసినట్లు అశోక్ గజపతిరాజు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. గతంలో పైడితల్లి అమ్మవారి పండగ సమయంలో దర్శనానికి అవకాశం కల్పించలేదని ఆరోపిస్తూ పోలీస్ బీట్ వద్ద కూర్చున్న విషయం.. జిల్లా పరిషత్ సమావేశాల సందర్భంగా ఏసీ గదులన్న కారణంగా తలుపులు మూస్తే, కేవలం ఆయన వస్తున్నారన్న అక్కసుతోనే మూసివేశామని రాద్ధాంతం చేయడం అందరికీ గుర్తుందన్నారు. నిజంగా పూలే విగ్రహానికి దండ వేయాలని అనుకున్నప్పుడు కనీసం ముందు రోజైనా అధికారులకు సమాచారం ఇస్తే వారే తాళం తీయించి ఉంచేవారని చెప్పారు. ఇటీవల ఆ విగ్రహం అభివృద్ధి పనులు చేపట్టామని, వాటర్ ఫౌంటైన్ వంటివి ఏర్పాటు చేయడంతో సెల్ఫీలు తీసుకునేందుకు వీలుగా నిర్దిష్ట సమయాల్లో తెరిచి ఉంచుతున్నామని వివరించారు. కేవలం సుందరీకరణ పనులు పాడవ్వకూడదన్న ఉద్దేశంతోనే కొంత సమయం తాళం వేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయంగా చూడడం సిగ్గుచేటన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

గజపతినగరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన పోటీలో గజపతినగరం, మెంటాడ జట్లు తలపడ్డాయి. గజపతినగరం జట్టు 10 ఓవర్లలో 97 పరుగులు చేయగా.. మెంటాడ జట్టు 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విజేతలకు టోర్నీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.